# కొడుకుని గుండెల్లో దాచుకుని పెంచినందుకు ఆ తండ్రికి దక్కిన ఫలం?

## లంక సూర్యకాంతం కథ

## సంక్షేమ కేంద్రం

"అదేమిటండీ అలా గట్టిగా అంటారు. ఆయనకి వినిపిస్తే ఏమన్నా అనుకుంటారు" అంది విమల.


కొడుకేం చెప్తాడోనని చెవులు రిక్కించాడు సీతారామయ్య.

"వినవయ్యి నేనేం కాని మాట అంటున్నానా. అందరికీ అనువుగా ఉండేట్లు మసలుకోవాలి. అంతేగానీ ఎవరికేం ఇబ్బంది కలిగిస్తామోనన్నది చూసుకోనక్కరలేదా ఆయన" అంటున్నాడు కృష్ణమూర్తి.

ఎక్కడో లోపల కలుక్కుమంది సీతారామయ్యకి. మాట్లాడకుండా తన గదిలో కెళ్ళిపోయాడు ఆయన. వెళ్ళి మంచం మీద వాలాడే గానీ మనస్సు పరిపరి విధాల పోతోంది ఆయనకి. ఏమిటి తను చేసిన తప్పు. పెద్దవాడవడమేనా. ఇంకో పదేళ్ళు పోతే వాడు మాత్రం అవడూ.

రాత్రి తనకి అస్తమానూ ఉమ్మేసుకోవాల్సిన అవసరం ఉంది. నిజమే. వస్తే ఏం చేయాలి మరి. వయస్సు పైబడినప్పటి నుండీ గొంతులో శ్లేష్మం ఉంగలు చుట్టుకుపోతూ వుంటుంది. కాండ్రించి ఉమ్మేసుకుంటేనే గానీ గొంతుక్కేదో అడ్డం పడ్డట్లే ఉంటుంది.

దానికి వాడింత మాటంటాడా. ఆ పిల్లలకే చేసుకోలేక ఛస్తూంటే ఈ ముసలాయనొకడని. ముసలివాళ్ళు మాత్రం పిల్లలతో సమానం కాదా. చిన్నప్పట్నించీ పిల్లల్ని పెంచి పెద్ద చేస్తే వాళ్ళకి తమ



TANGUDU RANGA RAO
NEWS AGENT
MADAPAM

తల్లితండ్రుల్ని చూడాల్సిన నైతిక బాధ్యత లేదా.

అలాగే బరువమకువే పెంచుతారా పిల్లల్ని. బరువమకువి పిల్లల్ని కూడా అలాగే వదిలేసేయడమో, లేకపోతే కొడ్తానో, తిడ్తానో ఉండడమో చేస్తే వాళ్ళేమయిపోతారు. అలాగే ఈ వయస్సులో ఉన్న పెద్దవాళ్ళు మాత్రం ఏమయిపోతారు.

దేవతలకి ఇవన్నీ ముందర అనుభవించనవసరం లేకుండానే తెలుస్తాయల్లే ఉంది. అందుకే ఎవరికెవరూ ఏమీ కారనేనేమో మేనక శకుంతలని పుడ్తూనే వదిలేసి ఉంటుంది.

ఏదేమయినా లక్ష్మి చాలా అదృష్టం చేసుకుంది. పెట్టి పుట్టింది కాబోలు. అందుకే ఇవన్నీ చూడాల్సిన అవసరం లేకుండా తనకంటే ముందరే వెళ్ళిపోయింది.

భార్య తలపుకి రాగానే ఆయనకి కళ్ళు చెమర్చాయి. తనదృష్టం బాగా ఉండి ఎంత మంచి భార్య దొరికింది తనకి. అసలు పెళ్లాన్ని పువ్వుల్లో పెట్టి చూసుకోడం అంటారు. అలాంటిది. తనని హృదయంలో నిలుపుకుని పూజించేది.

ఎంత కష్టమయినా పళ్ళబిగువున సహించి బాధపడిందే కానీ, ఒక్కమాట ఎవ ర్నీ ఏమీ అనలేదు. తన తల్లినీ తండ్రినీ ముసలితనంలో ఎంత బాగా చూసింది.

పిల్లల్ని తల్లిలా,
పేషెంట్‌ని డాక్టర్‌లా,
ఎంతో ప్రేమతో బాధ్యతాయుతంగా నిర్వర్తించింది తన విధులన్నీ.

తనకి మాత్రం మంచం మీద పడేవ రకూ అన్నీ తనే చూసేది.

కొడుకూ, కోడలూ ఉద్యోగాలకి వెళితే పొద్దున్న అందరికీ వండి పెట్టేది. సాయంత్రం కూడా పాపం కోడలు అలసిపోయి వస్తుంది అని వంటంతా తనే చూసేది. మనవల్ని దగ్గర పెట్టుకుని చూసేది. అవన్నీ మర్చిపోయారా వీళ్ళు.

ఏం మాట్లాడుకున్నా ఓ రహస్యం లేదూ. ఏం లేదు అన్నీ తనకి వినిపించేలాగనే అనుకోవడం. అసలు అనుకోవాల్సినంత పనేం ఉందని. అంత తప్పు తనేం చేశాడు.

తనూ లక్ష్మీ ఇద్దరూకూడా ఎంతో శ్రమ పడ్డారు, వీళ్ళని పైకి తీసుకు రావడానికి. అయినా వీళ్ళకి కృతజ్ఞత ఇంతయినా ఉందా.

మనిషన్నాక మానవత్వం అనేది ఉండాలి. సున్నితమయిన హృదయముండాలి. ఏదో పుట్టేశాం. ఏదో బతికేశాం. అంతవరకే తప్పించి మనం ఏ మాట మాట్లాడుతున్నాం, దీని వల్ల ఎవ రయినా బాధపడతారేమో . ఇది వీళ్ళు వినే మాట, ఇది వీళ్ళు వినకూడని మాట అన్న తారతమ్యం లేదే. అందుకే అన్నారు ఓ తియ్యని మాట, ఓ చల్లని చిరునవ్వు అని. అది లేకపోతే ఇంక ఏం ఉన్నా లేనట్లే లెక్క. వీటితో సాధించలేనిదేదీ లేదీ ప్రపంచంలో. చిరునవ్వుతో ఎదటివాళ్ళని ఎంతయినా ప్రసన్నం చేసుకోవచ్చు. అంతేగానీ ఈ రోజుల్లో పలుకే బంగారమయిపోయింది.

లోకం అంతా అలాగే ఉంది. ఏవిటోగానీ ఎదటివాళ్ళని సంతోషపెడ్దాం, అనేకంటే మనమేమన్నా కొంచెం మంచి పని చేస్తే ఎవరయినా సంతోషపడిపోతారేమోనని భయపడ్తూన్నట్లున్నారు జనం.

తను ఎంత బాగా చూసాడు అమ్మని నాన్నని. పెద్దయిన తర్వాత ఒక్కొక్కర్నీ ఉండడం కష్టమని ఆ వయస్సులో ఒంటరిగా ఉండలేరని బలవంతపెట్టి తను తెచ్చిపెట్టుకున్నాడు తల్లిదండ్రుల్ని. లక్ష్మి కూడా తనకన్ని విధాలా సహాయం చేసింది. చివరి టైములో అయినా వాళ్ళని కనిపెట్టుకుని ఉండడానికి ఇంట్లో ఎవరూ ఉండరని ఉద్యోగం కూడా మానేసి ఇంట్లో కనిపెట్టుకుని ఉండేది వాళ్ళని. లక్ష్మి ఉద్యోగం మానేస్తే ఇల్లు గడుస్తుందో గడవదోనని తనే కటుపటాయించాడు.

** ** **

''విమలా! నీతో ఓ విషయం మాట్లాడదామనుకుంటున్నాను. ఖాళీగానే ఉన్నావా'' అన్నాడు కృష్ణమూర్తి.


''ఖాళీగానే ఉన్నాను చెప్పండి. ఏమిటి అంత తీరిగ్గా మాట్లాడవల్సిన విషయం'' అన్నది విమల వంటింట్లో నుండి వస్తూ.

''నేనొకటడుగుతాను చెప్పు విమలా. మా నాన్నని...''

ఆ మాటలు విని భరించలేకపోయాడు సీతారామయ్య. తను అంత బరువయిపోయాడా వాడికి. ఇలా తయారయ్యాడేమిటి వీడు. ఇలా కూడా ఉండగలరా పిల్లలు. తను వీళ్ళని విడిచిపెట్టి ఉండగలడా అసలు. అయినా వాళ్ళెంత విదిలించి వేస్తున్నా తనకి వీళ్ళ దగ్గరే ఉండాలనిపిస్తోంది ఎందుకో. ఈ చివరి టైములో ఇంత తాపత్రయంతో కొట్టుకుపోతోందేమి తన మనస్సు.

ఎంత వినవద్దనుకున్నా మాటలు వినిపిస్తూనే ఉన్నాయాయనకి.

''అలా చేస్తే ఆయన బాధపడరా.



కాకపోయినా మీకు ఉన్న బాధ్యత మీ చెల్లెలికి ఎందుకు ఉంటుంది చెప్పండి. నేనంత శ్రమపడి ఉద్యోగం చేయాలా. ఇంట్లో పనులన్నీ ఎలా అవుతాయి'' అంది విమల.

''ఈ వరస మరీ బాగుంది. నాలుగొందలు వస్తాయనుకుంటే ఓ ఏభై ఇచ్చి పనిమనిషిని పెట్టుకుంటాము. అంతేగాని మనం చాలీచాలని జీతంతో బాధపడాల్సిన పనేముంది. ఇప్పుడు పిల్లలు చిన్నవాళ్ళు కనక తెలవడం లేదు గానీ, పెద్దవుతూంటే ఇంకా ఎంతెంత ఖర్చులుంటాయి'' అన్నాడు ఆవేశంగా కృష్ణమూర్తి.

''అయినా వాళ్ళకి విధాయక మేముంది ఆయన్ని అట్టే పెట్టుకోడానికి''

''విధాయకం కాకపోతే వాళ్ళకీ మనకీ అంతే సంగతులు. మా నాన్న ఇద్దరికీ సమానంగా చేయలేదా. నాకు చదువు చెప్పించాడు. మా చెల్లాయికి కొంత చదువు చెప్పించి పెళ్ళి చేశాడు. ఇద్దరికీ సమానంగా చేసినప్పుడు పెద్దవాళ్ళని పంచుకోవాల్సిన బాధ్యత కూడా ఇద్దరిదీ కాదా?''

''ఏమో బాబూ. మీరంత వాదనేస్తుంటే నేనే మాటా చెప్పలేను. ప్రతీదానికీనూ. ఇంతకీ వాళ్ళు కూడా ఇష్టపడాలి కదా''

సీతారామయ్యకి వద్దనుకున్నా ఆ మాటలన్నీ వినిపిస్తూనే ఉన్నాయి.

** ** **

''లక్ష్మీ తొందరగారా. అవతల టైమయిపోతోంటే ఇంకా తయారవ్వవేమిటి?''

''వస్తున్నానండీ వీడేమో ఏడుపు. తయారవ్వాలి కదా''

ఇద్దరూ కలిసి ఓ పది నిముషాల్లో బైటపడ్డారు కృష్ణని తీసుకుని. 'శిశు సంక్షేమ సంస్థ' అని బోర్డు ఉన్నచోట ఆగింది రిక్షా. ఇద్దరూ లోపలికి నడిచారు.

లోపల ఆఫీసు రూములో కూర్చున్నారు. పనిమనిషి లోపలికి అమ్మగారిని పిల్చుకొని రావడానికి వెళ్ళింది.

''వీడినిలా చేర్పించడం నాకేం నచ్చలేదండీ. ఏమేడ్పిస్తాడో ఏమో'' అన్నది లక్ష్మి.

'''అదే అలవాటవుతుంది లక్ష్మీ. మనకి అవసరం ఉన్నప్పుడలా చేయడంలో తప్పేముంది. మనకి బాబంటే ప్రేమ లేదా. ఉన్నది చూపించుకొనే అవకాశం కూడా ఉండాలి కదా''

లోపల నుండి శారదాంబ వచ్చింది కర్టెన్ తొలగించుకొని.

నలుగురైదుగురు పిల్లలు లోపలున్నట్లు సవ్వడి వినిపిస్తోంది.

ఆమెకి భర్త లేదు. ఇద్దరు పిల్లలున్నారు. గడవడం కోసం ఇలా ఓ దారి ఏర్పరచుకుంది.

ఆమె వచ్చి ఎదర కూర్చుంది. ''ఊఁ చెప్పండి. మీ వివరాలు''

సీతారామ్ అన్నాడు. ''ఏడు మా

బాయి కృష్ణండి. పిల్లని సాయంత్రం ఐదు గంటల వరకూ ఇక్కడ చేర్చాలని వచ్చాను. మీరు ఫీజెంత చెప్తే..."

"మంచిది. నెలకి వందరూపాయలివ్వండి. ఈ రోజే చేరుస్తారా. మళ్ళీ ఇంకేదన్నా మంచి రోజు చూసుకుని వస్తారా" అన్నది శారదాంబ.

"ఈ రోజే చేరుస్తామండీ. మా ఆవిడ ఈ రోజు నుంచే ఉద్యోగంలో చేరుతోంది. ఇంట్లో ఎవరూ చూసేవాళ్ళు లేరు. ఇక్కడ అన్నీ సదుపాయాలూ ఉంటాయా"

"అ అన్నీ ఉంటాయి. అయినా మీరు లోపలికొచ్చి చూసుకోండి"

ముగ్గురూ కలిసే లోపలకెళ్ళారు. కొంచెం విశాలంగా ఉన్న గది అది.

ఓ మూడు ఉయ్యాలలూ, తోపుడు బళ్ళు ఉన్నాయి అక్కడ.

ఏడుగురు చిన్నపిల్లలు సంవత్సరం దాటిన వాళ్ళ దగ్గర నుండి నాలుగు సంవత్సరాల పిల్లల వరకూ ఉన్నారక్కడ. ఓ చిన్నమ్మాయి పదేళ్ళుంటాయేమో పనిపిల్ల కాబోలు ఓ పిల్లాడికి పాలు పట్టోంది.

లోపల వాతావరణం బాగానే ఉన్నట్టుంది. బాగా లేకపోయినా చేసేదేమీ లేదు అవసరం ఉన్నప్పుడు.

కృష్ణని కూడా అక్కడ దింపింది లక్ష్మి.

లక్ష్మి కొంగు గుప్పిట్లో బిక్కించుకుని ఏడ్పు మొదలెట్టాడు.

కృష్ణ వాడి గుప్పిళ్ళు వదిలించుకు కూర్చోపెట్టాల్సి వచ్చింది. మెల్లగా వాడితో తనూ కింద కూర్చుని బొమ్మలు చేతిలో పెట్టి వాడు ఆడుతూంటే బయటికొచ్చారు.

గుమ్మం దాటేసరికే కెవ్వుమంటూ ఏడుపు మొదలెట్టాడు వాడు. అయినా తొందరవల్ల ఇంక నిలబడే టైము లేకపోయింది.

అక్కడి నుండి రోజూ ఇదే గొడవ. రోజూ పేచీయేవాడు. ఈ రోజు ఇంటికి వచ్చిందగ్గర్నుండీ రేపు వెళ్ళడం గురించిన బెంగేవాడికి.

రోజూ ఇంటికి తీసుకెళ్ళడానికి. లక్ష్మి అక్కడి కెళ్ళేసరికి కళ్ళనీళ్ళతో ఎదర కనిపించకుండా పోయినా, చేతులు చాపుకుంటూ పరిగెట్టుకుని వచ్చి లక్ష్మి వళ్ళో వాలిపోయేవాడు. లక్ష్మికి కూడా అంత బెంగే.



## ఎంత

"రెండుని రెండుతో గుణిస్తే ఎంత?" ఇంటర్వ్యూలో అడిగాడు ఛైర్మన్ రేవంత్‌ని.

"మీకెంత కావాలనుకొంటున్నారో చెప్పండి సార్! అంతే వచ్చేలా చేస్తాను!" బదులిచ్చాడు రేవంత్.

"నీకే ఈ ఎకౌంటెంట్ ఉద్యోగం!" అన్నాడు వెంటనే ఇంటర్వ్యూ కమిటీ ఛైర్మన్.

జోకర్ (హైదరాబాద్)

అక్కున చేర్చుకుని తలా, ఒళ్ళూ నిమురుతూ ఓదార్చేది.

ముద్దుల వర్షం కురిపించేది. వాడెంత బెంగ పెట్టుకున్నాడోనని ఆమె గుండె తరుక్కుపోయేది.

కొంచెం పెద్దయ్యేసరికి అడుగుతూండేవాడు వాడు.

“అమ్మా రేపు నా దగ్గరే ఉంటావా నువ్వు” అని.

“అలాగే ఉంటాలేమ్మా. నువ్వు కడుపునిండా తిని నిద్రపో” అనేది లక్ష్మి.

నిద్రలో కూడా లక్ష్మిని అటూ, ఇటూ కదలకుండా పట్టుకుని నిద్రపోయేవాడు. వదిలేస్తే ఎక్కడికయినా వెళ్ళిపోతుందేమోనన్నట్లుగా. అయినా వాడికి రోజూ తప్పేది కాదు ఆ బాధ.

** ** **

“నేనెంత బాధపడ్డానో నీకేం తెలుసు విమలా. పోనీ చిన్నప్పుడు ఏదో అయిపోయిందనుకున్నా కొంచెం పెద్దయ్యాక హాస్టల్‌లో ఉండాల్సి వచ్చింది. ఎదుటి వాళ్ళకి కూడా మనంత బాధ వుంటే అనుకోవచ్చు ఏమయినా. అయినా మా నాన్న కిలాంటివేమీ లేవులే. ఏదయినా బాధపడ్తే మా అమ్మే బాధపడేది అంతే.”

“మీరలా అంటున్నారు గానీ ఆయనకి మాత్రం ఎందుకు బాధ వుండదు. అందరూ చెప్పుకోలేరు పైకి అంతే”

“ఆ చెప్పుకోలేకపోడం కాదు. ఏం కాదు. అసలు మనసులో ఉంటే చెప్పుకోకుండా ఎలా ఉండగలుగుతారెవరయినా”

అసలే మంటున్నాడు వాడు. తన మనస్సులో ప్రేమనేది లేదా. అంటే అందరి తల్లిదండ్రులూ పిల్లల్ని ఇంతకంటే బాగానే చూస్తున్నారా? పిల్లలు తల్లిదండ్రుల్నిలాగే చూస్తున్నారా?

తన మనసేదో రాయి అన్నట్లే చెప్తున్నాడు వాడు.

అసలు తనని లక్ష్మి తప్పించి వీళ్ళెవరూ కూడా సరిగ్గా అర్థం చేసుకోలేదు. తమ అవసరం తీరేవరకూ, పని జరగదేమోనని ఉపయోగించుకున్నారంతే.

తల్లిదండ్రులు చెయ్యలేకపోతే చెల్లెలి పెళ్ళి తను చెయ్యాల్సి వచ్చింది. తమ్ముణ్ణి చదివించాల్సి వచ్చింది. తల్లిదండ్రులకి డబ్బు పంపించాల్సి వచ్చింది నెలనెలా. దాంతో లక్ష్మి కూడా ఉద్యోగం చెయ్యకుండా గడవని పరిస్థితి. తనకేమో మూడేళ్ళకోమారు బదిలీలు.

వీటితో వాడిని కొన్నాళ్ళు ‘చైల్డ్ కేర్ సెంటర్’లోనూ, కొన్నాళ్ళు హాస్టల్స్‌లోనూ ఉంచాల్సి వచ్చింది. వాడేం చేస్తాడట వాడి పిల్లల్నిప్పుడు.

వాణ్ణి హాస్టల్సులో ఉంచకుండా చదివించవచ్చును కానీ అలాగయితే వాడి చదువు దెబ్బ తింటుందని హాస్టల్స్‌లో ఉంచాల్సి వచ్చింది.

తనని అమ్మాయి దగ్గర ఉంచుదామని వీళ్ళ ఆలోచన. కాని అమ్మాయి యిష్టపడ్డా అల్లుడొప్పుకోవద్దూ. కావాల్సిన వాళ్ళకి లేని ప్రేమ పై వాళ్ళకేముంటుంది.

అందరూ కోడళ్ళని అనుకుంటారు. నిజానికి కొడుకు మంచివాడయితే కోడలేమి చేయగలదు. అంతా మన భ్రమంతే.

కొడుకూ కోడలూ అనేమీ ఉండదు బుద్ధిని బట్టి ఉంటుందంతే. లోపలేం జరుగుతుందో తెలియక అందరూ కోడళ్ళని ఆడిపోసుకుంటారంతే.

నిజానికిప్పుడు వీళ్ళకేమంత ఉద్యోగం అవసరం లేదు. ఓ పదహారొందలు జీతం వస్తుంది. స్వంత ఇల్లు ఉంది. తనెంతో కష్టపడి నిలవేసి సంపాదించినది అది.


అయినా దరిద్రమేమొచ్చిందో మరి. అందుకే అన్నారు. ఉన్నవాళ్ళకి ఉన్నంత దరిద్రమని.

ఎంత ఉన్నా సంతృప్తి లేదు. ఇంకా అన్నీ తనకే కావాలనే తపన. ఇందులో డబ్బు సంపాదనొక్కటే తప్పించి ఓ బంధుత్వాలూ, అభిమానాలూ అనేవేమీ ఉండవు. సంపాదించినదంతా తనకే కావాలనే స్వార్థం తప్పితే ఓ వంద రూపాయలన్నా భార్యని ఖర్చు పెట్టుకోనివ్వరు ఇలాటివాళ్ళు.

అంత ఫ్రీగా ఉండే మనిషయితే అందర్నీ ఇంత బాధపెట్టనే లేరు. కాకపోయినా ఇదంతా తన ఖర్మ. ఆ పోయే ప్రాణమేదో తొందరగా పోగూడదూ. పాపీ చిరాయువు అన్నారు. తనేదో భరించలేని పాపం చేసేడేమో అందుకే ఇంత బాధపడాల్సి వస్తోంది.

సెల్ఫ్ సింపతీ ఉండకూడదంటారు నిజమే. కానీ మన చుట్టూ ఉన్న వాతావరణమంతా అలాంటిదే.

"విమలా ఆయనకి అన్నం పెట్టెయ్యి. మనం కూడా తినేద్దాం."



## క్యాప్సూల్ వైద్యం

ఈనాడు మనం అత్యాధునిక జీవితాన్ని గడుపుతున్నామని విర్రవీగుతున్నా పారిశ్రామిక ప్రగతి మనకు ప్రసాదిస్తున్న కాలుష్యం పుణ్యమా అని సమాజంలో నేడు ప్రతి వారికీ ఏదో ఒక దీర్ఘవ్యాధి అంటిపెట్టుకుని ఉంటోంది. పేర్లు కూడా పెట్టలేని అనేక కొత్త వ్యాధులు ఈనాడు మన మీద దండయాత్ర చేస్తున్నాయి. అందువల్లే నేటి పరిస్థితులకనుగుణంగా ఎప్పటికప్పుడు మనిషి వ్యాధిని బహిర్గతం చెయ్యగల్గిన ఓ అద్భుత క్యాప్సూల్‌ను అమెరికాలోని హాప్కిన్స్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఈ క్యాప్సూల్‌ను మింగినవారికి శరీరంలో ఆమ్లత్వం, గుండెకొట్టుకునే రేటు వంటి అనారోగ్య లక్షణాలుంటే ఎలాంటి పరీక్షలు లేకుండా, వినూత్న కంప్యూటర్ వారికి తగిలిస్తే తెల్సిపోతాయట! అద్భుతంగా ఉంది కదూ!

జూపిటర్

అవును మరి. తనతో కలిసి భోజనం వేయడం కూడా ఇష్టం ఉండదేమో వాడికి. రోజూ అంతే తనకి ఈ గదిలో పెట్టేసి వాళ్ళు వేరే తింటారు. నలుగురిలో కలిసి తినాలనుండదా తనకి. వాడితో భోజనం చేసి కొన్ని సంవత్సరాలయిపోయింది.

అంతే కానీ 'రా నాన్నా భోజనం చేద్దామన్న మాటనలేదు వాడెప్పుడూ. పెళ్ళాంతోనయితే సరదాగా కబుర్లు చెప్పుకుంటూ చెయ్యవచ్చును. తనతో నయినా ఏదో బాధ్యత తీరుస్తున్నాడు తప్పించి అభిమానమేమన్నా ఉంటుందా?

పక్షులంతే వాటి నోటితో పట్టుకొచ్చి ఆహారం పిల్లల నోటికందిస్తాయి. రెక్కలొచ్చేసరికల్లా ఎగిరిపోతాయూ పక్షులు. ఈ మనుషులేమీ అంతకంటే భిన్నంగా లేరు.

"మామయ్యా. భోజనం తెచ్చాను లేవండి"

"అలాగేనమ్మ. అక్కడ పెట్టి వెళ్ళు. తర్వాత చేస్తాలే"

విమల వెళ్ళిపోయింది. మళ్ళీ ఆలోచనలు.

** ** **

"నాన్నా, నాన్నా, మీరు తొందరగా తయారవ్వండి. నేనూ, విమలా మీతో వచ్చి మిమ్మల్నక్కడ దింపేసి ఆఫీసుకి వెడతాము"

"ఎక్కడికిరా"

"అదే నాన్నా, మీకు తెలవదూ. మీ సామాన్లు కూడా సర్ది పెట్టింది. ఏం చెయ్యను మరి. చెల్లాయేమో బావ వొప్పుకోడం లేదని రాసింది. మిమ్మల్నట్టే పెట్టుకోడానికి వాళ్ళత్తగారూ, మామగారూ కూడా వాళ్ళ దగ్గరకొచ్చే ప్రయత్నంలో ఉన్నారట"

"అయితే నేనెక్కడికి మరి"

"అదే నాన్నా! ఈ మధ్య ఓల్డ్ ఏజ్ సెంటర్స్ పెట్టారు కదా. మిమ్మల్నక్కడ చేర్పిద్దామని. ఏం చేస్తాం మరి. తప్పదు. మన పరిస్థితులలాంటివి"

"ఏమిట్రా ఆ పరిస్థితులు?"

"అదే నాన్నా! మేమిద్దరం ఉద్యోగానికి వెళితే మీకు కావలసినవెవరు చూస్తారు? ఎవర్నన్నా పనివాళ్ళని పెట్టినా వాళ్ళు సరిగ్గా చూస్తారన్న గ్యారంటీ ఉండదు. అందులో అయితే అందరూ మీ వయసు వాళ్ళే ఉంటారు. కాబట్టి మీకు బాగా కాలక్షేపంగా కూడా ఉంటుంది"

"ఒరేయ్. మిమ్మల్నందర్నీ విడిచి నేనుండగలన్రా అక్కడ"

"ఏవిటి నాన్నా మీ చాదస్తం. అసలు ఒక వయసొచ్చిన తర్వాత వానప్రస్థం స్వీకరించమన్నారు కదా! ఇది కూడా అలాంటిదే. దీన్ని మీరు బాగా ఉపయోగించుకోవాలి"

"నాకిక్కడే బాగుంటుంది రా"

"విమలా ఈయనేమీ తేల్చరుగాని, ఆ బట్టలు అవీ పట్రా తొందరగా

బయల్దేరివెళ్దాం. పద మళ్ళీ మనకి ఆలస్యమవుతుంది.''

విమల బట్టలు తీసుకుని వచ్చింది. ఇద్దరూ చెరోవైపునా పట్టుకుని ముసలాయన్ని గుమ్మం దగ్గరగా ఉన్న టాక్సీలోకి ఎక్కించారు. పిల్లలిద్దరూ గుమ్మంలో నిలబడి ఏడుపు మొదలెట్టారు. ''తాతయ్యా! ఎప్పుడు వస్తావు? మా దగ్గర ఉండవా?'' అంటూ. ''ఉంటానమ్మా! మీ కంటే నాకు కావలసిన వాళ్ళెవరు? మీరు బాగా చదువుకోండి. అప్పుడు వస్తాను'' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు సీతారామయ్య.

టాక్సీ వేగంగా ముందుకు కదిలింది. ఆ యింటి నుండి దూరంగా లాక్కెళ్ళిపోతోంది. ఆయన హృదయం ఆక్రోశిస్తూనే ఉంది.

''నన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయావు లక్ష్మీ. నువ్వు ఉండి ఉంటే ఇద్దరం సరదాగా ఏ హనీమూన్‌కో వెళ్ళినట్లు ఇక్కడకు వచ్చి ఉండేవాళ్ళం కదా! ఈ ఒంటరితనం భరించలేను. భగవంతుడా! నన్ను నా లక్ష్మి దగ్గరకు తీసుకెళ్ళవు''

టాక్సీ గమ్యస్థానం చేరింది. ఆశ్రమం బోర్డు నల్లటి అక్షరాల్లో మెరుస్తోంది.

''నాన్నా! నాన్నా! తొందరగా దిగండి. తొందరగా మిమ్మల్ని దింపేసి నేను మళ్ళీ తొందరగా వెళ్ళిపోవాలి'' అన్నాడు కృష్ణమూర్తి. ''ఏం నిద్రలో ఏమిటో'' అని విసుక్కుంటూ తండ్రిని కుదిపాడు కృష్ణమూర్తి. ఆ చలనం లేని శరీరం పక్కకి ఒరిగిపోయింది.

''నాన్నా'' ఒక్క మాటుగా దుఃఖం తన్నుకొచ్చింది కృష్ణమూర్తికి అన్నాళ్ళు కరడు గట్టిన గుండె కరిగినట్లుగా. సీతారామయ్య కోరిక తీర్చడానికా అన్నట్లు టాక్సీ వెనక్కు తిరిగి ఇంటివైపు బయలుదేరింది.

